క్లుప్తంగా

కాలేజీలో మధ్యాహ్న భోజనం ప్రారంభం

తోటమూల(గంపలగూడెం): గంపలగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని మంగళవారం ప్రిన్సిపాల్ కే.వెంకటేశ్వరరావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రమం తప్పకుండా కళాశాలకు హాజరయ్యేందుకు దాతల సహకారంతో మధ్యాహ్న భోజనాన్ని అమలు చేస్తున్నట్లు తెలిపారు. అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది, పలువురు దాతల సహకారంతో 45 రోజుల పాటు కళాశాలలో మధ్యాహ్న భోజనం అందజేస్తామన్నారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నూజివీడు: లైన్ మెయింటెనెన్స్ నిమిత్తం పట్టణంలోని పలు ప్రాంతాల్లో బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీసీపీడీసీఎల్ ఈఈ డి.కృష్ణనాయక్ తెలిపారు. రాజీవ్ సర్కిల్ వద్ద నుంచి బస్టాండు రోడ్డు వరకు, బంగినపల్లితోట, డీఎస్పీ కార్యాలయం ఏరియా, సెయింట్ఆన్స్ స్కూల్ ఎదుటి రోడ్డు, అరుణ్ ఐస్‌క్రీమ్ పక్క రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

జక్కంపూడి(విజయవాడరూరల్): విధులపట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ బి.భార్గవి హెచ్చరించారు. మంగళవారం జక్కంపూడి గ్రామ, వైఎస్సార్ కాలనీలో సచివాలయాలను ఆమె సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. ఏఎన్ఎమ్ గ్రేడ్‌వన్ అధికారి అనుమతి తీసుకోకుండా సెలవు పెట్టడాన్ని ఎంపీడీఓ గుర్తించారు. గ్రామ సచివాలయాల్లో సిబ్బంది నిబంధనల ప్రకారం విధులను నిర్వహించాలన్నారు. అనంతరం జక్కంపూడిలో వీఎంసీ చెత్తడంపింగ్ చేసిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ పరిశీలనలో గ్రామ కార్యదర్శి టి.భారతి, గ్రామ సచివాలయ సిబ్బంది ఉన్నారు.

పీఏసీఎస్ కార్యదర్శి శ్రీహరికి సన్మానం

జి.కొండూరు: స్థానిక పీఏసీఎస్ బ్యాంకు సెక్రెటరీ యనమదల శ్రీహరి మంగళవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా బ్యాంకు చైర్మెన్ వేములకొండ రాంబాబు శ్రీహరిని ఘనంగా సన్మానించారు. రాంబాబు మాట్లాడుతూ సెక్రెటరీ ఉద్యోగ విరమణ చేసినప్పటికీ తన సేవలను అందిస్తూ సహకార వ్యవస్థ బలోపేతంలో భాగస్వామి కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ, పలువురు పీఏసీఎస్‌ల చైర్మెన్‌లు, అధికారులు పాల్గొన్నారు.

పౌర హక్కులపై అవగాహన ఉండాలి

ముసునూరు: రాజ్యాంగం ప్రతి పౌరునికీ కల్పించిన హక్కులను తెలుసుకుని, బాధ్యతగా నడుచుకోవాలని తహసీల్దార్ దాసరి సుధ సూచించారు. లోపూడి గ్రామ సచివాలయంలో సర్పంచ్ పేరం కృష్ణ అధ్యక్షతన మంగళవారం పౌరహక్కుల అవగాహన సదస్సు నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యుడు వరికూటి ప్రతాప్, వైస్ ఎంపీపీ కె.రాజానాయన, ఎంపీడీఓ జి.రాణి, కార్యాలయ పర్యవేక్షకుడు సాయిరాం, వార్డు సభ్యులు, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు, స్థానికులు పాల్గొన్నారు.

ఉరుసు ప్రారంభం

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లిలో ప్రసిద్ధిగాంచిన షాబుఖారీ దర్గా 426వ ఉరుసు మహోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. దర్గా సూఫీ మతగురువు ఆల్తాప్ రజా వేడుకలను మత పెద్దలతో కలసి మంగళవారం ప్రారంభించారు. దర్గాలో బాబాకు చాదర్‌కప్పి ప్రార్థనలు చేశారు. ముస్లిం సంప్రదాయ బద్ధంగా గుసులు నిర్వహించారు. వేడుకల్లో కుల మతాలకు అతీతంగా గ్రేస్ మినిస్ట్రీస్ సంస్థ డైరెక్టర్ మోగులూరి ఏలీషా, నైజీరియాకు చెందిన క్రైస్తవ మత పెద్దలు, పాస్టర్లు పాల్గొని వేడుకలు విజయవంతంగా జరగాలని ఆకాంక్షించారు. భక్తులకు అన్నదానం చేశారు.

80 మంది దివ్యాంగ విద్యార్థులకు పరీక్షలు

నూజివీడు: దివ్యాంగులకు ఉపకరణాలకు ఎంపిక శిబిరాన్ని సమగ్రశిక్ష ఆధ్వర్యంలో స్థానిక ఎస్ఆర్ఆర్ హైస్కూల్ ఆవరణలో మంగళవారం నిర్వహించారు. నూజివీడు, ఆగిరిపల్లి, ముసునూరు, చాట్రాయి మండలాలకు చెందిన దివ్యాంగ విద్యార్థులు 80 మందిని పరీక్షించారు. వైద్యులు, ఎంఈఓ బి.వెంకటేశ్వర్లు, ప్రాజెక్టు అసిస్టెంట్ కోఆర్డినేటర్ బి.భాస్కర రాజు, పలువురు ఫిజియోథెరపిస్టులు, ఐఈఆర్పీలు, ఐఈడీఎస్ఎస్ టీచర్లు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలను దరిచేరనీయొద్దు

విస్సన్నపేట: యువత మత్తుపదార్థాలకు బానిసలై భవిష్యత్తును పాడు చేసుకోరాదని ఎస్ఐ పరిమి కిషోర్ అన్నారు. మంగళవారం స్థానిక శ్రీశ్రీ కళాశాలలో మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల వల్ల అనార్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. నిషేధిత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. గంజాయి, హెరాయన్ వంటి మత్తు పదార్థాలకు బానిసలై జీవితాలను పాడు చేసుకోవద్దని వివరించారు. మత్తు పదార్థాల సమాచారం తెలియ జేయాలని కోరారు.

ఉపాధి కల్పనే ప్రభుత్వ ధ్యేయం

- నూజివీడులో మెగా జాబ్ మేళా
- ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు



మెగా జాబ్‌మేళాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు

నూజివీడు: రాష్ట్ర ప్రభుత్వం స్కిల్ కాలేజీలు, స్కిల్ హబ్‌లను ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతీ యువకుల్లో నైపుణ్యాలను పెంపొందింపజేస్తోందని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. ఏపీఎస్ఎస్‌డీసీ, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయాల సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక ఎస్ఆర్ఆర్ హైస్కూల్‌లో మంగళవారం ఏర్పాటుచేసిన మెగా జాబ్‌మేళాను ఎమ్మెల్యే ప్రారంభించారు. స్కిల్‌హబ్‌లు, స్కిల్ కాలేజీలను అనుసంధానం చేసేందుకు తిరుపతిలో స్కిల్ యూనివర్శిటీని సైతం ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. నూజివీడు ట్రిపుల్ ఐటీలో కూడా స్కిల్ డెవలప్‌మెంట్ కాలేజీని ప్రభుత్వం మంజూరు చేసిందని, దీనికి ఐదెకరాల స్థలాన్ని ఇచ్చామని వివరించారు.

168 మంది ఎంపిక..

నూజివీడు నియోజకవర్గం నుంచి జాబ్‌మేళాకు 435 మంది హాజరవ్వగా 168 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికైనట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఇ.తమ్మాజీరావు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులను ఎమ్మెల్యే ప్రతాప్ అభినందించారు. జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, నూజివీడు ఎంపీపీ ఆరేపల్లి శిరీష, ముసునూరు ఎంపీపీ రావర్ల కృష్ణకుమారి, వైఎస్సార్ సీపీ ముసునూరు, నూజివీడు మండలాధ్యక్షులు మూల్పూరి నాగవల్లేశ్వరరావు, శీలం రాము, సీడాప్ జేడీ ఎం.పార్థసారథి, జిల్లా ఉపాధి కార్యాలయ ప్రతినిధి జి.ప్రవీణ్, ఏరియా కోఆర్డినేటర్ దయాల రాజశేఖర్, సీఐ ఎంవీఎస్ఎస్‌మూర్తి, వైఎస్సార్ సీపీ నాయకులు ఆరేపల్లి రాంబాబు, పల్లె రవీంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


నూజివీడులో పశు ఆరోగ్యసేవల వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు

పశువులకు ఇంటి వద్దే వైద్య సేవలు

నూజివీడు: పాడి పశువులకు అనారోగ్యం సంభవిస్తే ఇంటి వద్దే వైద్య సేవలు అందించేందుకు డాక్టర్ వైఎస్సార్ సంచార పశు ఆరోగ్య సేవల వాహనం దోహద పడుతుందని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. నూజివీడు నియోజకవర్గానికి కేటాయించిన రెండో వాహనాన్ని మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ వాహనం వల్ల ముసునూరు, చాట్రాయి మండలాల్లోని పాడి పశువులకు త్వరితంగా వైద్యసాయం అందుతుందన్నారు. 1962 నంబర్‌కు ఫోన్ చేసి వెంటనే పశు ఆరోగ్య సేవల వాహనం ఆ రైతు ఇంటి వద్దకు వస్తుందని చెప్పారు. గతేడాది ఇచ్చిన వాహనం ద్వారా ఇప్పటి వరకు నియోజకవర్గంలో 660 పశువులకు వైద్యసాయం అందించినట్టు తెలిపారు. వీటిలో 80 వరకు మైనర్ ఆపరేషన్లు చేశారన్నారు. వాహనంలో పశువైద్యుడితో పాటు సిబ్బంది, మందులు అందుబాటులో ఉంటాయన్నారు. ఇలాంటి సౌకర్యం దేశంలో ఆంధ్రప్రదేశ్‌లో మాత్రమే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని వివరించారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ నూజివీడు డీడీ ఎం.వెంకటేశ్వరరావు, ధర్మాజీగూడెం ఏడీ టి.రామకృష్ణ ప్రసాద్, జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, ఎంపీపీ ఆరేపల్లి శిరీష, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాము, పశు వైద్యాధికారులు చైతన్య, లక్ష్మణనాయక్, శివవర్మ, మహేంద్ర, నాయకులు రామగిరి రంగబాబు, ఆరేపల్లి రాంబాబు, హరికోటి ప్రసాద్ పాల్గొన్నారు.

అసమానతల నిర్మూలనకే 'సంక్షేమం'

- తిరువూరు ఎమ్మెల్యే రక్షణనిధి
- అక్కపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం


అక్కపాలెంలో లబ్ధిదారుడికి సంక్షేమ బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

అక్కపాలెం(తిరువూరు): సామాజిక అసమానతల నిర్మూలనే ధ్యేయంగా రాష్ట్రప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని తిరువూరు ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి అన్నారు. తిరువూరు మండలం అక్కపాలెంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. గ్రామంలో సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి పొందిన కుటుంబాలను కలిసి వారికి అందుతున్న ప్రయోజనాలను తెలుసుకున్నారు. గతంలో ఏ ప్రభుత్వమూ అమలు చేయని రీతిలో దారిద్ర్యరేఖకు దిగువ ఉన్న వారి అభ్యున్నతికి ప్రవేశపెట్టిన పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజా సంకల్ప యాత్రలో గుర్తించిన ప్రజా సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డి సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి విజయవంతంగా అమలు చేస్తున్నారన్నారు. అక్కపాలెం గ్రామాభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఏఎంసీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు యరమల రామచంద్రారెడ్డి, ఎంపీపీ గద్దల భారతి, వైస్ ఎంపీపీ వెంకట నరసమ్మ, మునుకుళ్ళ పీఏసీఎస్ చైర్‌పర్సన్ వెదురు గోపిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు నాగిరెడ్డి, జగన్, పదిలం శ్రీను, అధికారులు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధికి నిరంతర కృషి

చైర్‌పర్సన్ త్రివేణీదుర్గ



నూజివీడు: రాజకీయాలకతీతంగా ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు సహకారంతో పట్టణాభివృద్ధికి కృషి చేస్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణీదుర్గ అన్నారు. స్థానిక కౌన్సిల్ సమావేశ హాలులో మంగళవారం ఏర్పాటుచేసిన మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశానికి ఆమె అధ్యక్షత వహించి మాట్లాడారు. పట్టణ అభివృద్ధికి ప్రతిపక్ష కౌన్సిలర్లు కూడా సహకరించాలన్నారు. పలువురు కౌన్సిలర్లు డ్రెయినేజీ వ్యవస్థ, పారిశుద్ధ్యం, ట్యాంకర్ల ద్వారా మంచినీటి సరఫరా తదితర అంశాలను ప్రస్తావించగా చైర్‌పర్సన్ సమాధానం ఇచ్చారు. మున్సిపల్ కోఆప్షన్ సభ్యులు రామిశెట్టి మురళీకృష్ణ మాట్లాడుతూ కౌన్సిల్ దృష్టికి తీకొచ్చిన సమస్యలను సకాలంలో స్పందించి పరిష్కరించాలని అధికారులను కోరారు. మున్సిపల్ కార్యాలయానికి రూ.4 లక్షలతో నూతన కంప్యూటర్లు కొనుగోలు చేయాలని, 25వ వార్డులో సబ్‌జైల్, సబ్ ట్రెజరీ వద్ద సీసీ డ్రెయిన్, సీసీ రోడ్డును రూ.4.95 లక్షలతో నిర్మించడానికి, మున్సిపల్ కార్యాలయంలోని పై అంతస్తు శ్లాబ్ పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో రూ.24.23 లక్షలతో నిర్మించడానికి, ఐదో వార్డులో రూ.4.72 లక్షలతో సీసీ డ్రెయిన్ నిర్మాణానికి, గడపగడపకు మన ప్రభుత్వం నిధులతో 23, 24 వార్డుల్లో రూ.20 లక్షలతో చేపట్టే తదితర పనులకు కౌన్సిల్ సమావేశంలో ఆమోదించారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ సయ్యద్ అబ్దుల్ రషీద్, కోఆప్షన్ సభ్యులు లాంప్రసాదరావు, షేక్ మెహబూబ్ బీ, డీఈ కె.లక్ష్మీనారాయణ, టీపీఓ చిన వెంకయ్య, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు
- వడ్లమానులో గడప గడపకు మన ప్రభుత్వం


వడ్లమానులో వృద్ధురాలికి బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు

ఆగిరిపల్లి: అర్హులందరికీ సంక్షేమ పథకాలను అమలు చేయడం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. ఆగిరిపల్లి మండలం వడ్లమానులో మంగళవారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల బ్రోచర్లను లబ్ధిదారులకు అందజేశారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని ఎమ్మెల్యే ప్రతాప్ అన్నారు. అర్హులందరికీ పథకాలను అందిస్తున్నామని, సీఎంజగన్ ఆదేశాల మేరకు ప్రతి గడపకూ వెళుతున్నామని చెప్పారు. ఎవరికైనా పథకాలు అందకపోతే తన దృష్టికి తీసుకొస్తే న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఉపసర్పంచినల్లిబోయినరాంబాబు, ఎంపీటీసీ సభ్యుడు రానిమేకల సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పల్లగాని నరసింహారావు, జెడ్పీటీసీ సభ్యుడు పిన్నిబోయిన వీరబాబు, ఎంపీపీ అనూష ఇసాక్, పార్టీ గ్రామ అధ్యక్షుడు జేవీఆర్, కుప్పాల నాగరాజు, రెడ్డి రామకృష్ణ, జలసూత్రం కృష్ణమూర్తి, తహసీల్దార్ ఉదయ్ భాస్కరరావు పాల్గొన్నారు.

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం


సీఎం వైఎస్ జగన్, ఎమ్మెల్యే వసంత చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న లబ్ధిదారులు, నాయకులు

ఇబ్రహీంపట్నం: జగనన్న చేదోడు నగదు బ్యాంకుల్లో జమ కావడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. ఇబ్రహీంపట్నం 3వ సచివాలయం వద్ద ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ చిత్ర పటాలకు వైఎస్సార్ సీపీ నాయకులతో కలసి మంగళవారం క్షీరాభిషేకం చేశారు. వరుసగా మూడో ఏడాది రూ.10 వేలు జమ చేయడంతో దర్జీలు, రజకులు, నాయీబ్రాహ్మణుల ఒక్కొక్క కుటుంబానికి రూ.30 వేలు వరకు ఆర్థిక సహాయం అందినట్లు వారు వెల్లడించారు. పీఏసీఎస్ చైర్మన్ మునగాల సాంబశివారెడ్డి, లంకే అంకమోహనరావు, నిడుముక్కల శివశంకరరావు, నల్లమోతు చిన్నయ్య, వార్డు కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ విగ్రహావిష్కరణ సభ విజయవంతం

తరలివచ్చిన కార్యకర్తలకు ఎమ్మెల్యే కృతజ్ఞతలు


నూజివీడు నుంచి ఈదులగూడెంకు వైఎస్సార్ సీపీ శ్రేణుల ర్యాలీ

నూజివీడు: ఆగిరిపల్లి మండలం ఈదులగూడెంలో మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహావిష్కరణకు తరలివచ్చిన పార్టీ శ్రేణులకు, అభిమానులకు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు మంగళవారం కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం జరిగిన సభకు ఎమ్మెల్యే కార్యాలయం నుంచి ద్వారకా ఎస్టేట్, చిన్నగాంధీబొమ్మ సెంటర్, మున్సిపల్ కార్యాలయ సెంటర్,బస్టాండు సెంటర్, రాజీవ్ సర్కిల్ మీదుగా వందలాది ద్విచక్ర వాహనాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. వైఎస్సార్ జోహార్, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వం వర్ధిల్లాలి, ఎమ్మెల్యే ప్రతాప్ అప్పారావు జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు.విగ్రహావిష్కరణకార్యక్రమానికి ఎమ్మెల్యేతో పాటు, ఏపీ రాష్ట్ర కోఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్ దేశిరెడ్డి రాఘవరెడ్డి, పట్టణ అధ్యక్షుడు శీలం రాము, జెడ్పీ వైస్ చైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, ఎంపీపీ ఆరేపల్లి శిరీష, ముసునూరు, నూజివీడు, చాట్రాయి మండలాల పార్టీ అధ్యక్షులు మూ ల్పూరి నాగవల్లేశ్వరరావు,పోలిమెట్ల శివ, మిద్దే బాలకృష్ణ ఈదులగూడెంకు తరలివెళ్లినవారిలో ఉన్నారు.

ప్రభుత్వ భవనాలను త్వరగా నిర్మించండి


మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి నాగరాజు

గంపలగూడెం: గ్రామాల్లో ప్రభుత్వ భవనాల నిర్మాణ పనులు వేగవంతంగా జరిగేలా పర్యవేక్షించాలని మండల ప్రత్యేక అధికారి డీ నాగరాజు పేర్కొన్నారు. గంపలగూడెం మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల పరిధిలోని గ్రామ ప్రత్యేక అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్నెస్ సెంటర్ల భవనాలు ఏ దశలో ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. నాడు-నేడు రెండో విడతలో మంజూరైన నిధులతో పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పనులు ఏ విధంగా జరుగుతున్నాయో సమీక్షించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన సమస్యల గురించి సమావేశంలో చర్చించారు. వాటి పరిష్కారానికి తీసుకోవలసిన చర్యల గురించి వివరించారు. ఎంపీడీఓ వై పిచ్చిరెడ్డి, తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి, మండల స్థాయి వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించిన దాతలకు సన్మానం


దాతను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

నూజివీడు: పాఠశాల అభివృద్ధి పనులకు సహకరించిన దాతను మంగళవారం సన్మానించారు. మండలంలోని పల్లెర్లమూడి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి గ్రామానికి చెందిన పలువురు ఆర్థిక సాయం అందించినట్టు హెచ్ఎం పిల్లా జోజప్ప తెలిపారు. గారపాటి నాగ అంజనీదేవి తన భర్త జ్ఞాపకార్థం రూ.1.30 లక్షలతో స్టేజీ పై కప్పు నిర్మించారని, అసెంబ్లీ నిర్వహించే ప్రాంగణాన్ని ఉప్పలపాటి వెంకటేశ్వరరావు రూ.45 వేలతో ఫ్లోరింగ్ చేయించారని, పాఠశాల కమిటీ చైర్మన్ కొక్కెరపాటి చెన్నకేశవరావు రూ.30 వేలతో పాఠశాల ఆవరణలో సరస్వతీదేవి విగ్రహం ఏర్పాటు చేయించినట్టు హెచ్ఎం తెలిపారు. వీరిని సర్పంచి పులపాక సౌమ్యరేఖ, ఎంపీటీసీ చిలుకూరి అనూర్‌బాషాలు సత్కరించారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పోలిమెట్ల శివ, నాయకులు యనమదల గాంధీ, కైలే సురేష్, ఆశీర్వాదం, ఉపాధ్యాయుడు సునంద్‌ఖన్నా తదితరులు పాల్గొన్నారు.

చిన్న గరుడ వాహనంపై శోభనాచలుడు

ఆగిరిపల్లి: శోభనాచల వ్యాఘ్రలక్ష్మీ నరసింహ స్వామి రథసప్తమి ఉత్సవాల్లో భాగంగా స్వామివారు మంగళవారం భక్తులకు చిన్న గరుడ వాహనంపై దర్శనమిచ్చారు. ఉదయం స్వామివారి కల్యాణ మండపంలో (పెద్ద కొఠాయి) ఆగిరిపల్లికి చెందిన భక్తుల కైంకర్యంలో శాంతి కల్యాణం వైభవంగా నిర్వహించారు. రాత్రి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో స్వామివారిని పెళ్లికుమారునిగా అలంకరించి చిన్న గరుడ వాహనంపై ఊరేగించారు. కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు వేదాంతం శేషుబాబు, అనంతకృష్ణ కనులపండువగా నిర్వహించారు.

ఉపాధి హామీ పనుల సామాజిక తనిఖీ

జి.కొండూరు: మండల పరిధిలో 2020–2021, 2022 సంవత్సరాలకు ఉపాధి హామీ పనులపై స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సామాజిక తనిఖీ ప్రజా వేదికను మంగళవారం నిర్వహించారు. ద్వామా పీడీ జే సునీత ఆధ్వర్యంలో రెండు సంవత్సరాల్లో జరిగిన పనులపై రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఎంపీడీఓ అనూరాధ మాట్లాడుతూ 21 గ్రామ పంచాయతీల పరిధిలో రెండు సంవత్సరాలలో రూ.21కోట్ల విలువ గల 458 పనులు జరిగినట్లు తెలిపారు. రికార్డులను పరిశీలించిన అధికారులు కూలీల హాజరులో తేడాలను గుర్తించి రూ.19,825ను రికవరీ రాసినట్లు వివరించారు. కార్యక్రమంలో విజయవాడ ఏపీడీ పీ పద్మ, నందిగామ ఏపీడీ కే.మణికుమార్, ఉపాధి హామీ పథకం సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువుల గోదాముల తనిఖీ

తిరువూరు: దాళ్వా సీజన్‌లో అవసరమైన అన్ని ఎరువులూ తిరువూరు మండలంలో లభ్యమవుతున్నాయని, డీలర్లు గరిష్ట ధరకు లోబడి అమ్మాలని మండల వ్యవసాయాధికారిణి పద్మ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని ప్రైవేటు డీలర్ల గోదాములను ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. రిటైల్ డీలర్ల వద్ద 130 మెట్రిక్ టన్నుల యూరియా, రైతు భరోసా కేంద్రాల్లో 20 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వ ఉన్నాయన్నారు. మరో 125 టన్నుల యూరియా కూడా రెండు రోజుల్లో రైతు భరోసా కేంద్రాలకు సరఫరా అవుతుందని పద్మ తెలిపారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. దాళ్వా సీజను డిమాండ్‌కు అనుగుణంగా ఎరువులు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

కాండం తొలిచే పరుగు నివారణకు చర్యలు

ఎ.కొండూరు: కాండం తొలిచే పురుగు నివారణకు యాజమాన్య పద్ధతులు పాటించాలని వ్యవసాయశాఖ అధికారి టిప్పుసుల్తాన్ అన్నారు. మండలంలో వల్లంపట్ల గ్రామంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ అధికారులు వరి నారుమళ్లను పరిశీలించారు. అనంతరం ఏవో మాట్లాడుతూ కాండం కొలిచే పురుగు నివారణకు క్లోరిఫైరిపాస్ 2.5 మీ.లీ లేదా కార్ టాప్ హైడ్రోక్లోరైడ్ రెండు గ్రాములు లీటర్‌నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. చిరుపొట్ట దశలో ఎకరాకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 4 గ్రాము గుళికలు 8కిలోలు లేక కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు 10 కిలోలు లేదా క్లోరాంట్రనిల్‌ప్రోల్ 0.4 శాతం గుళికలు 4 కిలోలు వాడలన్నారు.


స్టడీ మెటీరియల్ అందజేత

రెడ్డిగూడెం: స్థానిక ఫ్రెండ్స్ సర్వీసు సొసైటీ ఆఫ్ ఫ్రీ ఎడ్యుకేషన్ ట్రెనింగ్ సెంటర్‌లో గురుకుల పాఠశాలల్లో 5వ తరగతి ప్రవేశ పరీక్షకు హాజరవుతున్న విద్యార్థులకు స్టడీమెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు చాట్ల విజయ్‌కుమార్ మాట్లాడుతూ గత ఎనిమిది సంవత్సరాలుగా గురుకుల పాఠశాలల్లో ప్రవేశం కొరకు జరిగే పరీక్షకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓబీసీ విద్యార్థులకు ఉచితంగా శిక్షణ మెటీరియల్‌ను కూడా పంపిణీ చేస్తున్నామన్నారు. వారానికి ఒక మోడల్ పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు. ఫ్రెండ్స్ సర్వీసు సొసైటి గౌరవ సలహాదారుడు పత్తిపాటి పాల్ ఇమ్మానియేలు, డైరెక్టర్ చాట్ల హన్న, ప్రమీల, సుధ తదితరులు పాల్గొన్నారు.

చిరు ధాన్యాలపై అవగాహన

రెడ్డిగూడెం: మండలంలోని నరుకుళ్లపాడు గ్రామ రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో చిరు ధాన్యాలపై అవగాహన కార్యక్రమం మంగళవారం జరిగింది. అంతర్జాతీయ చిరుధాన్యాలు సంవత్సరం సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహించారు. కృషి విజ్ఞాన కేంద్రం సబ్జెక్టు మాటర్ స్పెషలిస్ట్ ప్రభావతి మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చిరు ధాన్యాల పంటలకు ప్రత్యేక మద్దతు ధర, ఉచిత పంటల బీమా కల్పిస్తుందని తెలిపారు. విస్సన్నపేట వ్యవసాయ సహాయ సంచాలకులు జేఎల్ కిరణ్‌జ్యోతి మాట్లాడుతూ వరి కన్నా తక్కువ ఖర్చుతో, తక్కువ నీటి సదుపాయంతో ఈ చిరు ధాన్యాలు సాగు చేసుకోవచ్చుఅని తెలిపారు. ఈకార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి ఆర్ సురేష్, గ్రామ సర్పంచ్ నూనె అప్పిరెడ్డి, గ్రామ వ్యవసాయ సహాయకులు రాకేష్, రైతులు పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ కార్యవర్గ ప్రమాణ స్వీకారం



విస్సన్నపేట: స్థానిక భారతి సేవా సెలబ్రేషన్స్‌లో వాసవీ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నూతన కార్యవర్గంతో వాసవీక్లబ్ జిల్లా గవర్నర మిత్తింటి శారద ప్రమాణ స్వీకారం చేయించారు. వాసవీక్లబ్ అధ్యక్షుడిగా యండూరి చంద్రశేఖర్, వాసవీ వనితా క్లబ్ అధ్యక్షు రాలుగా యండూరి రాజ్యలక్ష్మి, యూత్‌క్లబ్ అధ్యక్షుడిగా కుక్కడపు డీఎస్‌కే చైతన్య, ప్రధాన కార్యదర్శులుగా సంకా రాంబాబు, గంధం నీరజ, దోసపాటి సాయి ప్రతాప్ ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి సురేష్, జిల్లా వైస్ గవర్నర్ కేఎల్‌వీ సతీష్, సీనియర్ సభ్యులు కుక్కడపు నాగేశ్వరరావు, దారా శ్రీనివాసరావు, చేడే పెదనాగేశ్వరరావు, విస్సన్నపేట, పుట్రేల, చనుబండ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించొద్దు

గంపలగూడెం: ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించవద్దని ఎస్ఐ వి.సతీష్ హెచ్చరించారు. ఉన్నతాధికారుల ఆదేశానుసారం మంగళవారం తోటమూలలో ఓవర్ లోడ్‌తో వెళుతున్న ఆటోలను ఆపి డ్రైవర్లు, ప్రయాణికులను కౌన్సెలింగ్ ఇచ్చారు. ప్రయాణికులను సురక్షితంగా గమ్యం చేర్చాల్సిన బాధ్యత డ్రైవర్లపైఉందన్నారు. ఓవర్ లోడ్‌తో వెళితే జరిగే ప్రమాదాలను ప్రయాణీకులకు వివరించారు. డ్రైవర్లు తప్పక యూనిఫామ్ ధరించాలి అన్నారు. ఆటోలకు సంబంధించిన రికార్డులను, డ్రైవింగ్ లైసెన్స్‌లను పరిశీలించి, సక్రమంగా లేని ఆటోలకు అపరాధ రుసుం విధించారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి

ఆగిరిపల్లి: ప్రమాదవశాత్తు కింద పడి గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎన్.చంటిబాబు మంగళవారం తెలిపారు. ఆగిరిపల్లి మండలం వడ్లమానుకు చెందిన జలసూత్రం ఆంజనేయులు (72) గ్రామంలోని కోనేరు గట్టుపై ఉన్న చిన్న గుడిసెలో ఒంటరిగా ఉంటున్నాడు. మానసిక పరిస్థితి బాగోలేని ఆంజనేయులు గత నెల 28న రాత్రి గ్రామంలోని నూజివీడు రోడ్డుపై పడిపోయాడు. స్థానికులు 108 వాహనంలో నూజివీడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీనిపై ఆంజనేయులు కోడలు జలసూత్రం వెంకటేశ్వరమ్మ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

